క్లుప్తంగా

ఓటు హక్కుతోనే ప్రజాస్వామ్య మనుగడ



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):ఓటు హక్కును వినియోగించుకోవటం ద్వారా ప్రజాస్వామ్య మనుగడకు ప్రజలందరూ అండగా ఉండాలని విజయవాడ హోల్‌సేల్ అండ్ రిటైల్ పూజా మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గోకవరపు మురళీకృష్ణ, ఎం.కృష్ణారావు తెలిపారు. ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరుతూ అవగాహన ర్యాలీని సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా సామారంగంచౌక్ నుంచి బయలుదేరిన ప్రదర్శన మొయిన్‌బజార్, శివాలయంవీధి, కెనాల్‌రోడ్డు తదితర ప్రాంతాల మీదుగా ముందుకు సాగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గోకవరపు మురళీకృష్ణ, కృష్ణారావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో దేశ సాధారణ ఎన్నికల్లో పౌరులందరూ లింగ, వర్ణ, కులమతాలకు అతీతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ తమ సంఘం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కొత్తమాసు సుబ్రహ్మణ్యం, సభ్యులు గోలపూడి శ్రీనివాసరావు, శివరామ్ శేఖర్, నందిపాటి పవన్, కారంశెట్టి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

త్రిశక్తి పీఠం హుండీ ఆదాయం రూ.9.31లక్షలు



కృష్ణలంక(విజయవాడతూర్పు): నగరంలోని బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో హుండీల ద్వారా అమ్మవార్లకు భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. గత 150 రోజుల్లో భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించగా రూ.9,31,565 ఆదాయం లభించింది. దేవదాయ శాఖ తరపున ఈవో ఎం.సత్యప్రసాద్ పర్యవేక్షణలో ఆలయ సూపరింటెండెంట్ ఎ.మధుసూదనరావు ఆధ్వర్యంలో భక్తుల సమక్షంలో కమిటీ సభ్యులు కానుకలు లెక్కించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జి.పుల్లయ్య, కె.జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారు బీహెచ్ విజయకిరణ్, సభ్యులు జి.సత్యనారాయణ, పి.విజయ్, విశ్వేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

సంతాన సాఫల్య చికిత్సలపై ఫెర్టిజ్ఞాన్ 2024 సదస్సు



లబ్బీపేట(విజయవాడతూర్పు): సంతానలేమి సమస్యలు రోజు రోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ఆధునిక చికిత్సలపై అవగాహన పెంచుకునేందుకు ఫెర్టిజ్ఞాన్ 2024 పేరుతో సదస్సు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ సహకారంతో విజయవాడ ప్రసూతి, గైనకాలజికల్ సొసైటీ, ఫెర్టీ9 సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో వివిధ ప్రాంతాలకు చెందిన 182 మందికిపైగా వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంతానోత్పత్తి సంరక్షణ, వివిధ అంశాలపై సమగ్ర చర్చలు జరిగాయి. విశిష్ట వక్తలు ప్రీ కాన్సెప్షన్ కౌన్సెలింగ్, సంరక్షణ, వంధత్వంలో జీవక్రియ ఆరోగ్యం పాత్ర, సంతానోత్పత్తిలో కీ హోల్ సర్జరీ, ఏఆర్‌టీ చట్టం, గైనకాలజిస్టుల దృక్పథం వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఇటీవల పురోగతి, పురుష భాగస్వామి మూల్యాంకనం, మెరుగైన ఫలితాలు కోసం కచ్చితత్వం, వంధత్వంలో అల్ట్రాసోనోగ్రఫీ వినియోగంపై చర్చలు జరిగాయి. ఈ కార్యక్రమంలో సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సుమ వర్మ సంతానోత్పత్తిలో పురోగతిని వివరించారు. ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్ డాక్టర్ జ్యోతి సి బుడితో పాటు పలువురు నిపుణులు విశ్లేషణాత్మక సందేశాలు ఇచ్చారు.

అప్పారావు మృతి తీరనిలోటు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, విజయవాడ వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మూకల అప్పారావు (62) మృతి ఉపాధ్యాయ సంఘాలకు, వెలమ సంక్షేమ సంఘానికి తీరని లోటు అని పలువురు నాయకులు అన్నారు. ఈ నెల 22వ తేదీన విజయవాడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రమైన గాయం కావడంతో నగరంలోని ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ అప్పారావు ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆయన విద్యార్థి దశలో వామపక్ష భావాలకు ఆకర్షితులై ఏఐఎస్‌ఎఫ్ చేరారు. ఎస్‌టీయులో సాధారణ సభ్యుడిగా చేరి జిల్లా, మండల, రాష్ట్ర స్థాయిలో అనేక బాధ్యతలను నిర్వర్తించారు. మాజీ ఎమ్మెల్సీలు జల్లి విల్సన్, ఏఎస్.రామకృష్ణ, పి.అశోక్ బాబు, సీపీఎం నాయకులు బాబురావు, వైఎస్సార్ సీపీ నాయకులు దేవినేని అవినాష్, వెలంపల్లి శ్రీనివాస్ తదితరులు నివాళులర్పించారు.

సుజనా..నీ బురిడి మాటలు ప్రజలు నమ్మరు

- మే 13 న నీకు చుక్కలు చూపించడం ఖాయం
- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ అసిఫ్



ప్రజలకు అభివాదం చేస్తూ ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ అసిఫ్



టిఫిన్ బండి వద్ద పునుగులు వేస్తున్న అసిఫ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి చెప్పే బురిడీ మాటలు పశ్చిమ ప్రజలు నమ్మబోరని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ అసిఫ్ అన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని విద్యాధరపురం 39వ డివిజన్‌లో కార్పొరేటర్ గుడివాడ నరేంద్రతో కలిసి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డివిజన్ పరిధిలో ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. 58 నెలల కాలంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. టిఫిన్ బండి వద్ద పునుగులు వేస్తూ ఓట్లు అభ్యర్థించారు. అవ్వతో మాటా మంతీ కలిపారు. ఈ సందర్భంగా షేక్ అసిఫ్ మాట్లాడుతూ 58 నెలల కాలంలో పశ్చిమ నియోజకవర్గంలో అనూహ్య రీతిలో అభివృద్ధి జరిగిందన్నారు. రోడ్లు, పార్కులు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించారని చెప్పారు. బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి వ్యాఖ్యలపై మండిపడ్డారు. ఎమ్మెల్యే అంటే ఎలా ఉండాలో చూపిస్తానంటూ సుజనా చౌదరి చేసిన వ్యాఖ్యలు అర్థరహితమన్నారు. 12 ఏళ్లు రాజ్యసభ సభ్యుడిగా, కేంద్రమంత్రిగా ఉన్న సుజానా ఏం చూపించారని ప్రశ్నించారు. కేంద్ర మంత్రిగా విజయవాడకు గానీ, ఉమ్మడి కృష్ణా జిల్లాకు గానీ ఏమైనా చేశారా అని నిలదీశారు. మంత్రి పదవిని అడ్డం పెట్టుకుని పేదలు కష్టపడి పైసాపైసా బ్యాంకుల్లో దాచుకున్న సొమ్మును లూటీ చేశాడని ధ్వజమెత్తారు. ఆర్థిక నేరాలు ఎలా చేయాలో చూపిస్తారా? బ్యాంకులకు బురిడీ కొట్టి దొరికిపోతే కేసుల నుంచి తప్పించుకోవడానికి రాత్రికి రాత్రే పార్టీ మారి కేసుల విచారణ నుంచి తప్పించుకోవడం ఎలానో చూపిస్తారా అని నిలదీశారు. పేరు వెనుక చౌదరి అని పెట్టుకుని కులాలు కూడు పెడతాయా అంటూ వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కులం, మతం పేర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. పశ్చిమ నియోజకవర్గ ప్రజలు తెలివిగల వారని, సుజనా చౌదరి బురిడీ మాటలు నమ్మబోరన్నారు. బ్యాంకుల నుంచి దోచుకున్న సొమ్ముతో ఏదైనా చేయొచ్చు అనుకుంటే ఇక్కడ కుదరదన్నారు. నియోజకవర్గ ప్రజలు మే 13న ఓటు రూపంలో సుజనా చౌదరికి చుక్కలు చూపించడం ఖాయమన్నారు.

కులం, మతం చూడకుండా సంక్షేమం...

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులం, మతం అనే భేదం చూడకుండా అర్హతే ప్రామాణికంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ 58 నెలల పాటు సంక్షేమ పథకాలు అందించారన్నారు. ఇది ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి, సీఎం వైఎస్ జగన్‌కే సాధ్యమన్నారు. ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశామని, ప్రజలను ఓటు అడిగే హక్కు తమకే ఉందన్నారు. బీజేపీ, టీడీపీ అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు ఓట్లు అడిగేందుకు వెళితే ముస్లిం మహిళలు ఓటు వేసేందుకు నిరాకరించి తరిమి పంపిస్తున్నారని పేర్కొన్నారు. తిరిగి అధికారంలోకి వచ్చేది వైఎస్సార్ సీపీయేనని, ప్రతి సంక్షేమ పథకాన్ని కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, కార్పొరేటర్లు చలపతిరావు, చైతన్యరెడ్డి, డివిజన్ నాయకులు బీవీ రెడ్డి, బి. సాంబశివరావు, అంబటిపూడి శ్రీకాంత్, బొర్రా నరసింహారావు, రాజవరపు వెంకట్, కె.లక్ష్మి, చిన్న కోటేశ్వరరావు, ఏలూరు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సుజనాచౌదరిని ఎన్నికల్లో అనర్హుడిగా ప్రకటించాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):గెలుపు కోసం అడ్డగోలుగా ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తున్న విజయవాడ పశ్చిమ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుజనాచౌదరి నామినేషన్‌ను తిరస్కరించి, అనర్హుడిగా ప్రకటించాలని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్ కోరారు. ఈ మేరకు పశ్చిమ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సోమవారం ఫిర్యాదు చేశారు. గౌస్‌మొహిద్దీన్ మాట్లాడుతూ రెండు రోజుల క్రితం బీజేపీ అభ్యర్థి సుజనాచౌదరి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు మద్దతుగా టీడీపీ నాయకుడు జలీల్‌ఖాన్ ఓటర్లను ప్రలోభ పెట్టే విధంగా దేవుడి మీద, అమ్మవారి మీద ప్రమాణం చేసి సుజనాకు ఓట్లేయాలంటూ ప్రమాణాలు చేయించడం పూర్తిగా ఎన్నికల నిబంధలను ఉల్లంఘించటమేనన్నారు. ఉల్లంఘనల దృష్ట్యా తక్షణమే సుజనా చౌదరి అభ్యర్థిత్వాన్ని రద్దు చేస్తూ, అనర్హుడిగా ప్రకటించాలని రిటర్నింగ్ అధికారిణి కిరణ్మయిని కోరారు. వీడియో ఆధారాలను ఆమెకు అందించారు. విశ్వనాథ రవి, నంబూరి ప్రదీప్, షేక్ మెహరాజ్‌లతో పాటు లీగల్ టీం సభ్యుడు సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో మహిళా సాధికారత

వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి అసిఫ్



అసిఫ్‌ను సత్కరిస్తున్న మహిళా కమిటీ సభ్యులు

భవానీపురం(విజయవాడపశ్చిమ):సమాజంలో మహిళలు తలుచుకుంటే సాధ్యం కానిది లేదని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ అసిఫ్ తెలిపారు. వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా మహిళా కమిటీని ఇటీవల నియమించిన నేపథ్యంలో సోమవారం విద్యాధరపురం ఎన్నికల ప్రచారంలో ఉన్న అసిఫ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అసిఫ్‌కు శాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపారు. అదే సమయంలో అసిఫ్ కమిటీ సభ్యులకు శాలువా కప్పి సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని, 50 శాతం వారికి రిజర్వేషన్ కల్పిస్తూ శాసనసభలో చట్టం చేయటమే అందుకు నిదర్శనమన్నారు. అలాగే ఆసరా, చేయూత వంటి సంక్షేమ పథకాలతో మహిళా సాధికారత కల్పించారని తెలిపారు. ప్రతి సంక్షేమ పథకం మహిళల పేరుతో అందించటం మహిళలపట్ల సీఎం జగనన్నకు ఉన్న గౌరవం అని పేర్కొన్నారు. డ్వాక్రా మహిళలకు రుణ మాఫీ చేస్తానన్న చంద్రబాబు 2019 ఎన్నికలకు కొద్ది రోజుల ముందు పసుపు, కుంకుమ పేరుతో రూ.10 వేలు ఇచ్చి మభ్యపెట్టారని పేర్కొన్నారు. అందుకే వారంతా తగిన బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. మహిళలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చిన సీఎం జగనన్న నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేయాలని కోరారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితే తప్ప సంక్షేమ పథకాల కొనసాగింపు ఉండదని తెలిపారు. అసిఫ్‌ను కలిసిన వారిలో ఎన్టీఆర్ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శులు ఎండీ సల్మా సుల్తాన, బత్తిన నాగ పావని, కార్యదర్శులు రుద్రపాటి స్రవంతి, తంగిరాల ప్రమీల, జాయింట్ సెక్రటరీ పీతల పద్మ ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకంతో నియమించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ సహకరించిన జిల్లా అధ్యక్షుడు వెలంపల్లి శ్రీనివాసరావు, పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్‌కు ధన్యవాదాలు తెలియచేశారు.

అసిఫ్‌కు మద్దతుగా వ్యాపార, వర్తక సంఘాలు



అసిఫ్‌ను సత్కరిస్తున్న వర్తక, వ్యాపార సంఘాల నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ):పశ్చిమ నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ అసిఫ్‌కు వివిధ వ్యాపార, వర్తక సంఘాలు మద్దతుగా నిలిచారు. వైఎస్సార్ సీపీ నాయకులు జీఎంసీ బాబా, దావూద్, యాసిన్, బషీర్ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో ఆయా సంఘాల నాయకులు సోమవారం విద్యాధరపురంలోని వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రధాన కార్యాలయానికి వచ్చి అసిఫ్‌ను కలిసి పూలదండలతో సత్కరించారు. రానున్న ఎన్నికలలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ విజయానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. తద్వారా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చూడటమే లక్ష్యంగా పని చేస్తామని చెప్పారు. ముఖ్యంగా నవరత్నాలు ప్లస్ పేరుతో సీఎం జగనన్న ప్రకటించిన మేనిఫెస్టో తమను ఎంతగానో ఆకర్షించిందని తెలిపారు. ఈ సందర్భంగా షేక్ అసిఫ్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ రాష్ట్రానికి మళ్లీ ముఖ్యమంత్రి కావడం చారిత్రక అవసరమని చెప్పారు. పొరపాటున చంద్రబాబు కూటమికి ఓటేస్తే సంక్షేమ పథకాలకు కాలం చెల్లినట్లేనని తెలిపారు. పేదల బతుకుల్లో మరిన్ని వెలుగులు నిండాలంటే జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే సాధ్యం అన్నారు. బ్యాంకులకు వేల కోట్లు ఎగ్గొట్టిన ఆర్థిక నేరగాడు సుజనా చౌదరి మాయ మాటలను విని మోసపోవద్దని కోరారు. స్థానికుడిగా మీ అందరికి చిరపరిచితుడిని, అందుబాటులో ఉండే తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని)ని కూడా గెలిపించి జిల్లా అభివృద్ధికి దోహపడాలని కోరారు. ఆసిఫ్‌ను కలిసినవారిలో విజయవాడ లారీ డిస్పోజల్ అసోసియేషన్ సభ్యులు ఇర్ఫాన్, మస్తాన్, భవానీపురం పేపర్, డిస్పోజల్ సంఘం నాయకులు షేక్ అహ్మద్, బ్లూస్టార్ ఏజన్సీస్ ఉస్మాన్, వ్యాపారస్తులు అప్సర్, రెహమాన్, జిలాని, ఇక్బాల్, సుభాని, జీఎంసీ అల్తాఫ్, ఖాజా, గౌసీ, కరీంఖాన్, కరిముల్లా, అలీ, హబిబుల్లా తదితరులు ఉన్నారు.

జగనన్న పాలనలో అందరికీ మేలు

52వ డివిజన్‌లో ప్రచారం నిర్వహించిన కేశినేని శ్వేత



ప్రచారం నిర్వహిస్తున్న కేశినేని శ్వేత

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి మేలు చేకూరిందని విజయవాడ పార్లమెంట్ సభ్యులు, వైఎస్సార్ సీపీ లోక్‌సభ అభ్యర్థి కేశినేని నాని కుమార్తె కేశినేని శ్వేత అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 52వ డివిజన్ ఇన్‌చార్జి తంగెళ్ల రామచంద్రరావు ఆధ్వర్యంలో కేశినేని నాని, పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి షేక్ ఆసిఫ్‌ల విజయాన్ని కాంక్షిస్తూ కేశినేని శ్వేత కొత్తపేట 52వ డివిజన్‌లో సోమవారం సాయంత్రం విస్తృతంగా పర్యటించారు. కొండ ప్రాంతాల్లోని ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన మేలును వివరించి రానున్న ఎన్నికల్లో అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రచారంలో భాగంగా తాను వెళ్లిన ప్రతి గడప గడపలోనూ, అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. ప్రతి కుటుంబం తనను ఆప్యాయంగా స్వాగతిస్తున్నారని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ప్రజలందరికీ పలు రకాల మంచి జరిగింది కాబట్టే ప్రజలు మళ్లీ ఆయనను ముఖ్యమంత్రిగా రావాలని కోరుకుంటున్నారని చెప్పారు. గత మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలలో 99 శాతం పూర్తిచేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. అదేవిధంగా విజయవాడ పార్లమెంట సభ్యుడిగా కేశినేని నాని ప్రజలకు ఎంతో సేవ చేశారన్నారు. విజయవాడ రూపు రేఖలు మార్చి నవవిజయవాడగా రూపొందించేందుకు పాటుపడ్డారని చెప్పారు. రూ.8000 కోట్లతో విజయవాడ లోక్‌సభ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేసిన ఘనత కేశినేని నానికే ఉందన్నారు. పశ్చిమ అభ్యర్థిగా పోటీ పడుతున్న షేక్ ఆసిఫ్ చాలా సామన్యమైన నాయకుడన్నారు. అందరికీ అందుబాటులో ఉండటమే కాకుండా కార్పొరేటర్‌గా, ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా వివిధ పదవుల ద్వారా సేవలందించిన అసిఫ్ సైతం విజయం సాధిస్తారని వివరించారు. ఎంపీ కేశినేని నానిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తంగెళ్ల రామచంద్రరావు, విశ్వనాథ రవి, కర్రి గౌరి, కొరగంజి భాను, మజ్జి శ్రీను, త్రిమూర్తులు, శివ తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ బరిలో 15 మంది అభ్యర్థులు

- 38 మంది అభ్యర్థులు 61 నామినేషన్లు దాఖలు
- 22 మందికి చెందిన నామినేషన్లు తిరస్కరించిన ఎన్నికల అధికారులు
- 17 మందిలో ఇద్దరు విత్‌డ్రా
- ఆసిఫ్ పేరుతో పలు నామినేషన్లు



షేక్ అసిఫ్



సుజనాచౌదరి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):పశ్చిమ నియోజకవర్గ బరిలో 15 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా సోమవారం విత్‌డ్రా ప్రక్రియలో ఇద్దరు తమ నామినేషన్లను ఉపసంహరించుకోగా మిగిలిన 15 మంది బరిలో ఉన్నట్లుగా అధికారులు ప్రకటించారు. ఈ నెల 18వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్‌ను అధికారులు ప్రకటించారు. ఈ నెల 25వ తేదీ వరకూ అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నెల 26వ తేదీన నామినేషన్ల స్క్రూటినీ నిర్వహించారు. తాజాగా 29వ తేదీన విత్‌డ్రా ప్రక్రియ పూర్తి కాగా మిగిలిన వారిని అభ్యర్థులుగా ప్రకటించారు. అందులో భాగంగా పశ్చిమ నియోజకవర్గంలో 15 మంది అభ్యర్థులు తలపడనున్నారు.

పశ్చిమంలో అత్యధికంగా 38 మంది నామినేషన్లు

విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో అత్యధికంగా 38 మంది అభ్యర్థులు 61 నామినేషన్లను దాఖలు చేశారు. అందులో ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, భారతీయ జనతా పార్టీ, సీపీఐతో పాటుగా ఇతర గుర్తింపు పొందిన పార్టీలకు చెందిన నాయకులు స్వతంత్ర్య అభ్యర్థులుగా పోటీ పడుతున్న నాయకులు తమతమ నామినేషన్లను దాఖలు చేశారు. అందులో స్క్రూటినీలో దాదాపుగా 21 మందికి చెందిన 28 నామినేషన్లను అధికారులు వివిధ కారణాలతో తిరస్కరించారు. దాంతో 17 మందికి చెందిన మిగిలిన నామినేషన్లు విత్‌డ్రా సమయానికి ఉన్నాయి. అందులో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ పడుతున్న ఇట్టా భవానీ, షేక్ గయసుద్దీన్‌లు తమ నామినేషన్లను సోమవారం విత్‌డ్రా చేసుకున్నారు.

అసిఫ్ పేరుతో పలు నామినేషన్లు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి షేక్ అసిఫ్‌ను ఓడించాలనే తలంపుతో బీజేపీ నాయకులు, టీడీపీ నేతలు అసిఫ్ పేరుతో ఉన్న నలుగురుతో నామినేషన్లను హడావుడిగా వేయించారు. పశ్చిమ నియోజకవర్గంతో పాటుగా ఇతర నియోజకవర్గాల నుంచి సైతం అసిఫ్ పేరుతో ఉన్న వారిని తీసుకొచ్చి నామినేషన్లు ఆదరబాదరగా వేయించారు. అయితే ఆ హడావుడిలో సరైన నిబంధనలు పాటించకపోవటం, వివిధ కారణాల రీత్యా స్క్రూటినీ అధికారులు వాటిని తిరస్కరించారు. మొత్తం మీద 15 మంది నాయకులు వివిధ రాజకీయ, స్వతంత్ర పక్షాలకు చెందిన అభ్యర్థులుగా పోటీ పడుతున్నారు.

పశ్చిమంలో బరిలో నిలిచిన అభ్యర్థులు వీరే....

ఆసిఫ్ షేక్ (వైఎస్సార్ సీపీ), మద్దిరాల వినోద్‌కుమార్ (బీఎస్పీ), వై.సత్యనారాయణచౌదరి (బీజేపీ), కొణంకి వెంకటేశ్వరరావు(ఎస్‌యుఎన్ పార్టీ), జి.కోటేశ్వరరావు(సీపీఐ), ఖాదర్‌బాషా షేక్ (ఎంసీపీఐ (యు)), తాడంకి జగదీష్ రామచంద్రరావు (టీఆర్ఎస్ పార్టీ), నక్కల సాయిబాబు (నవరంగ్ కాంగ్రెస్ పార్టీ), పరసా సురేష్‌కుమార్(జైభీంరావు భారత్ పార్టీ), పోతిన వెంకటరామారావు (జైభారత్ నేషనల్ పార్టీ), మోహన్ దుర్గ ప్రసాద్ తాడేపల్లి (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), రమణప్రసాద్ కొత్తమాసు (సమాజ్‌వాదీ పార్టీ), షేక్ ఖాజావలీ (ఐ.యు.ఎం.ఎల్), విడవలపాటి విజయ శంకర్ (ఇండిపెండెంట్), శీరం నాగమల్లేశ్వరరావు(ఇండిపెండెంట్) ఉన్నారు.

కూటమికి ఎందుకు ఓటు వేయాలి?

- ముస్లిం రిజర్వేషన్‌ను వ్యతిరేకిస్తున్న ఎన్డీఏపై ఆగ్రహం
- రాష్ట్ర ముస్లిం ఐక్య వేదిక



అసిఫ్‌ను కలిసి మద్దతు తెలిపిన ముస్లిం ఐక్యవేదిక నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ):ముస్లిం మైనార్టీల అభ్యున్నతి కోసం మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఇచ్చిన 4 శాతం రిజర్వేషన్‌ను వ్యతిరేకిస్తూ రద్దు చేస్తామంటున్న ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు తాము ఎందుకు ఓటు వేయాలని రాష్ట్ర ముస్లిం ఐక్య వేదిక నాయకులు ప్రశ్నించారు. విద్యాధరపురంలో సోమవారం ఎన్నికల ప్రచారంలో ఉన్న పశ్చిమ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ అసిఫ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల రిజర్వేషన్లను రద్దు చేస్తామని ప్రకటించడమే కాకుండా తమ మనోభావాలను కించపరస్తూ దేశ ప్రధాని, కేంద్ర హోం మంత్రితో సహా బీజేపీ నాయకులు బహిరంగ సమావేశాల్లో మాట్లాడటం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో అనేక మంది ముస్లిం మైనార్టీలు పాల్గొన్నారన్న విషయం మోదీ, బీజేపీ నాయకులకు తెలియదా అని ప్రశ్నించారు. అలాగే దేశాభివృద్ధికి ఎనలేని కృషి చేసిన మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త అబ్దుల్ కలాం ముస్లిం సామాజికవర్గానికి చెందినవారు కాదా అంటూ బీజేపీ నాయకులపై మండిపడ్డారు. బీజేపీ నాయకులు మతతత్వాన్ని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తుంటే చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా పారదర్శకంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి ఆకాంక్ష మేరకు వై నాట్ 175 దిశగా ముందుకు సాగాలని కోరారు. ముస్లిం మైనార్టీలు మరింత అభివృద్ధి చెందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుని తీరాలని పేర్కొన్నారు. ఐక్యవేదిక రాష్ట్ర సమన్వయకర్త అహ్మద్ (చందస్), రాష్ట్ర అధ్యక్షులు జాఫర్, కోశాధికారి సలావుద్దీన్, అధికార ప్రతినిధి సయ్యద్ ఖలీల్, కార్యదర్శి సయ్యద్ నూర్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్, ఉపాధ్యక్షుడు అబ్దుల్లా, సహాయ కార్యదర్శి అహ్మద్, మహిళా అధ్యక్షురాలు షేక్ నసీమా, కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి సద్దాం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మేధో సంపత్తి హక్కుల ద్వారా విస్తృత ఆదాయం



మాట్లాడుతున్న అజిత్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మేధో సంపత్తి హక్కులపై అవగాహన పెంచుకోవటం ద్వారా విస్తృతమైన ఆదాయాన్ని పొందవచ్చని కేంద్ర పేటెంట్స్ అండ్ డిజైన్స్ జాయింట్ కంట్రోలర్ (చెన్నై) ఎం.అజిత్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఐక్యూ ఏసీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో 'మేథో సంపత్తి హక్కులు' అంశంపై వర్క్‌షాప్‌ను సోమవారం ఆ కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌కు ముఖ్యవక్తగా హాజరైన అజిత్ మాట్లాడుతూ మేధో సంపత్తి హక్కులపై భారతదేశంలో చాలా వెనుకబాటు ఉందన్నారు. దేశానికి చెందిన అనేక ఉత్పత్తులపై ఇతర దేశాలు పేటెంట్లు పొందటం ద్వారా హక్కులను సాధించి ఆదాయాన్ని పొందుతున్నాయన్నారు. వివిధ సంస్థలు, వ్యక్తులు వారు రూపొందించిన ఆవిష్కరణలు, ఉత్పత్తులపై వారికి హక్కులు ఉంటాయన్నారు. వీటిని అధికారికంగా నమోదు చేయించుకోవటం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా మేథో సంపత్తి హక్కులను పొందవచ్చన్నారు. ఈ విధమైన అంశాలపై అవగాహన కొరవడటం వలన చాలా విలువైన ఆదాయాన్ని భారతదేశం కోల్పోతోందన్నారు. మన దేశానికి మాత్రమే చెందిన అనేక ఉత్పత్తులను సైతం ఇతర దేశాలు తమవిగా చలామణి చేసుకుంటున్నాయని వివరించారు. ఈ విధమైన హక్కులపై అవగాహన కలిగి ఉండటం ద్వారా వ్యక్తిగతంగా, సంస్థలకు, దేశానికి కూడా ఆదాయం సమకూరుతుందన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ మేథో సంపత్తి హక్కులకు సంబంధించి మరింత లోతైన చర్చలు జరగాలన్నారు. వాటిపై విద్యార్థులు అధ్యాపకులు అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జి.కృష్ణవేణి, విభాగాధిపతి ఆర్.ఉదయ్‌కుమార్, అధ్యాపకులు బి.శృతి తదితరులు పాల్గొన్నారు.